
www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 15 | జూన్ | 2026
పేజీలు : 7

## ఉపాధి కూలీలకు నష్టం చేసే చర్యలను ఉపసంహరించుకోవాలి

-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



3 లో

# మోగనున్న బడి గంట..!



- -నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- -తొలి రోజే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ
- -23 పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు
- -కొత్తగా 114 ప్రీ ప్రైమరీ పాఠశాలలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బడిగంట మ్రోగనుంది. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తొలి రోజునే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో పాఠశాలలను ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 1,233 పాఠశాలలు వాటిలో ప్రాథమిక పాఠశాలలు 814, ప్రాథమికోన్నత పాఠశాలలు 191, ఉన్నత పాఠశాలలు 28 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 64,972 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి కార్యక్రమం ద్వారా, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో

మిగతా 2లో..

## కౌలురైతు పొట్టకొడుతున్న ప్రభుత్వాలు..!

- పట్టాదారులకే పీఎం కిసాన్, రైతుభరోసా..
సాగు చేసేవానికి గుండు సున్నా
- బ్యాంకుల దగా..
ప్రైవేట్ వడ్డీల దందా..
అప్పుల ఊబిలో కష్టజీవి
- రెండు ప్రభుత్వాల మొండి వైఖరిపై
వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం



సెంటర్‌స్ప్రెడ్

## కోటి రూపాయల గంజాయి పట్టివేత

-ఐదుగురు నిందితులు అరెస్టు



2 లో

## రైతన్నలూ.. నకిలీ విత్తనాలతో జాగ్రత్త..!

### రైతుల అమాయకత్వమే ఆసరాగా సాగుతున్న నకిలీ దందా



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకునే పనిలో ఉన్నారు. ప్రతి సీజన్ ప్రారంభంలో అన్నదాతలకు నకిలీ, నాసిరకం విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకోవాలనే కంపెనీలు, వారికి సహకరించే వ్యాపారులు లేకపోలేరు. మాయమాటలతో రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతూ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తూనే ఉన్నాయి. కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని

మిగతా 2లో..

# మోగనున్న బడి గంట..!





(మొదటిపేజీ తరువాయి)



మరమ్మతు పనులు చేపట్టారు. అరకొర మినహా అన్ని పాఠశాలల్లో వసతులు సమకూర్చారు. మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలు, అదనపు తరగతి గదులు, విద్యుత్ సౌకర్యం, భవనాలకు రంగులు వేయించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పూలు, తోరణాలతో అలంకరించి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేపట్టారు. బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు విస్తృత ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా జిల్లాలో ఎనిమిది భవిత కేంద్రాలు, 11 నాన్ భవిత కేంద్రాలు ఉన్నాయి. ఆ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు అప్పటి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సహకారంతో అదనపు కలెక్టర్ శ్రీజ ప్రత్యేక చొరవతో గతేడాది రూ.1.40 లక్షల నిధులు వెచ్చించి అందంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం వాటిలో 212 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. భవిత కేంద్రాల్లో సైతం ప్రవేశాలు పెంచేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 15న పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ :**

పాఠశాల తొలి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 4,45,820 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 4,05,426 పాఠ్య పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. ఇంకా 40,394 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. అవి కూడా రెండు మూడు రోజుల్లో జిల్లాకు చేరే అవకాశం ఉంది. తొలి రోజు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను మండల విద్యా వనరుల కేంద్రాలకు తరలించారు. మొత్తం 1,233 పాఠశాలల్లోని 64,972 మంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయాల్సి ఉండగా ఈ ఏడాది యూనిఫాం రంగును మార్చనుండడంతో వాటి పంపిణీ ఆలస్యం కానుంది.

**కొత్తగా ప్రీ ప్రైమరీ పాఠశాలలు :**

రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 114 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించనున్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించాలనే ఉద్దేశంలో ప్రీ ప్రైమరీ పాఠశాలలకు శ్రీకారం చుట్టింది. గతంలో 30 ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఉండగా కొత్తగా 114 ప్రీ ప్రైమరీ పాఠశాలలను జిల్లాలో మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయల నిధులు కేటాయించనున్నారు, వాటి ద్వారా కనీస సౌకర్యాలు కల్పించనున్నారు.

**23 పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు :**

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే గాక పుస్తక పఠనంపై ఆసక్తి, జాతీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ ఏడాది 23 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నారు. రీడింగ్ కార్నర్‌ల పేరిట తొలి దశలో జిల్లాలో 23 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఓ గదిలో ప్రత్యేకంగా అన్ని వసతులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం ఒక్కో పాఠశాలకు రూ. 15వేల చొప్పున నిధులు కేటాయించింది. ఆ నిధులతో గదుల్లో అవసరమైన మరమ్మతు పనులు చేయించడంతో పాటు చదువుకునేందుకు బల్లలు, పుస్తకాలు, ర్యాక్‌లు, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. అదేవిధంగా రోజు వారి వార్తా పత్రికలు, ఇతర జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచనున్నారు. అదేవిధంగా ప్రతి నెల పుస్తకాల కొనుగోళ్లు, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం రూ.1,000 నగదును అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ చేయనున్నారు.

# రైతన్నలూ నకిలీ విత్తనాలతో జాగ్రత్త..!



(మొదటిపేజీ తరువాయి)

అధికారులు సూచిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే తేరుకోలేని నష్టాన్ని చవి చూడవలసి వస్తుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ఏది మంచిదో, ఏది నకిలీదో అర్థం కాని విధంగా విత్తనాల ప్యాకెట్స్ ఉంటున్నాయని పేర్కొంటున్నారు. విత్తనాల బెడద రైతులకు సవాల్‌గా మారింది. కొందరు కేటుగాళ్ల కారణంగా ఆరుగాలం శ్రమించి అరక దున్ని విత్తనాలు వేసిన అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనాలని వ్యవసాయాధికారులు చూపిస్తున్నారు. అంతేకాదు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఆచరించినప్పుడే సాగులో సంపూర్ణ విజయం సాధ్యమవుతుంది. అనుకున్న దానికంటే ఎక్కువ దిగుబడులు సొంతం చేసుకోవచ్చు. వానకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులు అప్రమత్తంగా ఉండి సాగు మొదలు పెట్టాలి. ఏదో ఒక విత్తనాలు కొని, ఇచ్చి పచ్చి దుక్కిలో వేసుకుంటే అవి మొలకలు రాక అదును దాటిపోయి ఆ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకం కావచ్చు. అందుకే అన్నదాతలు వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

**మాయ మాటలను నమ్మొద్దు...**

వర్షాలు కురిస్తే చాలు రైతుల్లో హడావిడి మొదలవుతుంది. విత్తనాల కోసం రైతులు డీలర్ల దుకాణాల వద్దకు పరుగులు పెడతారు. పలు విత్తన కంపెనీలు డీలర్లకు ఆఫర్లు ప్రకటిస్తాయి. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. ఫొటోలు చూపించి ఆఫర్ల ఆశ చూపి వివిధ పట్టణాలకు కంపెనీవారు రైతులను తీసుకుపోవడం, గ్రామాల్లో తిరుగుతూ విత్తన ప్యాకెట్లు బుక్ చేసుకోవడం చేస్తుంటారు. వాటికి దూరంగా ఉండడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**రైతన్నలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...**

గ్రామంలో కానీ, మండలంలో కానీ ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. రైతులు కొనే విత్తనాలకు సంబంధించిన రసీదు(బిల్లు)ను దుకాణదారు నుంచి తప్పనిసరిగా తీసుకొని భద్రపరుచుకోవాలి. పంట దిగుబడి వచ్చే వరకు, పంట కాలం అయిపోయే వరకు బిల్లు రైతు దగ్గరనే భద్రపరుచుకోవాలి. తీసుకున్న బిల్లు మీద విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ ధర ఉండాలి. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన (గడువు) తేదీలు సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్నా, తడిసినా కొనుగోలు చేయొద్దు. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతం చూసుకోవాలి. బిల్లులపై దుకాణం ముద్ర ఉండేలా చూడాలి.

**సమాచారం ఇవ్వండి....**

గ్రామాల్లో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మే వారి వివరాలు మీకు అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలి. పక్క జిల్లా, రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఎవరైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మినచో సమాచారం ఇవ్వాలి. తొందరపడి లైసెన్స్ డీలర్ దగ్గర కాకుండా, ఇతరుల దగ్గర విత్తనాలు తీసుకొని ఇబ్బంది పడకూడదు.

## కోటి రూపాయల గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/కొణిజర్ల : అక్రమంగా తరలిస్తున్న కోటి రూపాయల విలువ చేసే 201 కేజీల గంజాయిని పట్టుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సూరజ్ ఆదివారం తెలిపారు. వైరా ఏసిపి సారంగపాణి ఆదేశాల మేరకు కొణిజర్ల పోలీసుల ఆధ్వర్యంలో కొణిజర్లలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ పక్కన, సత్యసాయి ఫౌండ్రి పల్లిపాడు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వైరా నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బోలేరో వాహనం దానికి పైలెట్‌గా వస్తున్న మారుతీ కారు డిజైర్ అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించి అట్టి వాహనాలను తనిఖీ చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. వారిని విచారించగా మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన అమూల్ నానోబా గోరే, లక్ష్మణ్ నాగనాథ్ కరే, కామారెడ్డి బాన్సువాడ మండలంకు చెందిన వసంత జాదవ్, షేక్ అన్సర్, షేక్ రహమత్ లుగా గుర్తించినట్లు తెలిపారు. బోలేరో వాహనంలో అక్రమంగా 201.45 కేజీల ఎండు గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ గంజాయి విలువ రూ.1,00,50,000 ఉంటుందని తెలిపారు. వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు, రూ. 2,800 నగదు, మారుతీ డిజైర్, బోలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి సప్లయర్, రిసివర్‌లు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

## గుట్టను మింగుతున్న మట్టి మాఫియా





ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం లింగ గూడెం రెవిన్యూ లో ఉన్న చిట్యాల బోడు గుట్ట ను గుల్ల చేస్తున్నారు. లింగగూడెం రెవిన్యూ లోని 254, 302 సర్వే నెంబర్ లలో ఉన్న చిట్యాల బోడు గుట్టను ఆంధ్ర మట్టి మాఫియా రాత్రి పూట తవ్వకాలు చేస్తూ సరిహద్దు లో ఉన్న ఆంధ్ర లోని రియల్ ఎస్టేట్ వెంచర్ లకు తరలిస్తున్నారు. గత 15 రోజులు గా యదేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి మాఫియా తవ్వకాలు జరిపిన తర్వాత గుట్ట కు అనుకోని ఉన్న కొంతమంది చదును చేసి ఆక్రమించుకునీ పెన్సింగ్ వేస్తున్నారు. దీనిపై రెవిన్యూ అధికారులకు సమాచారం ఉన్న పట్టించుకోవడం లేదు. లింగగూడెం రెవిన్యూ లోని ఒక వ్యక్తి చిట్యాల బోడు గుట్ట నుండి మట్టి తోలుకునేందుకు అన్ని తానే అయ్యి టిప్పర్ లారీ కి 500 రూపాయలు వసూలు చేస్తూ పర్మిషన్ లు ఇస్తున్నాడని గిరిజనులు ఆరోపిస్తున్నారు. అట్టి మట్టిని టిప్పర్ నాలుగు, ఐదు వేలకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి చిట్యాల బోడు గుట్టలో తవ్వకాలు అడ్డుకోకుంటే కొన్ని నెలల్లోనే గుట్ట మాయం అవుతుంది.

## పాఠ్య పుస్తకాలు పంపిణీ



ప్రజాపక్షం/పెనుబల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రారంభానికి ముందుగానే వాటి పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలో 17 ప్రాథమిక పాఠశాలలో 27 ఉన్నత ప్రాథమిక పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్నాయి. మొత్తం 22 వేల పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా ప్రభుత్వం 19 వేల పుస్తకాలను సరఫరా చేసింది. ఎంఈఓ అన్ని పాఠశాలకు సరఫరా చేసిన పుస్తకాలను ముందుగానే విద్యార్థులకు అందజేశారు. జూన్ 12న పాఠశాలలో ప్రారంభం కావలసి ఉండగా ప్రభుత్వం సెలవులను పెంచడంతో పాఠశాలలో ఇంకా ప్రారంభం కాలేదు. ఈలోపు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టి ప్రైవేటు పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో చదువులు ఉన్నతంగా ఉంటాయని, క్రమశిక్షణతో కూడిన విద్య ఆటపాటలో ఉంటాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని ఎంఈఓ అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదివితే తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవలసి ఉంటుందని అదే ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తారని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించవచ్చు అని ఆయన అన్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉపాధ్యాయుడు నిత్యం విద్యార్థుల చదువు పైన క్రమశిక్షణ పైన ప్రత్యేకమైన దృష్టి సారించి తగిన శ్రద్ధ తీసుకుంటారని అన్నారు.

# ఉపాధి కూలీలకు నష్టం చేసే చర్యలను ఉపసంహరించుకోవాలి



## -సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వి బి జీ రాం జీగా పేరు మార్చి వ్యవసాయ కార్మికులకు నష్టం చేకూరిస్తే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక చర్యలను తిప్పికొట్టే వరకు ఉద్యమించాలన్నారు. యుపిఏ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సాధించిన వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే ఎంజిఎన్ఆర్ఈజిఏ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను హరించివేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందన్నారు. దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లుకట్టించి ఇవ్వాలని, వృద్దులు, వికలాంగులు, వితంతువులు అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి ఎంజిఎన్ఆర్ఈజిఏ చట్టాన్ని కొనసాగించాలని, 200 రోజులు పని కల్పించాలని, 55 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు ఆరువేల ప్రభుత్వ పెన్షన్ ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని తదితర డిమాండ్స్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసు, జిల్లా ఆఫీస్ బేరర్స్ మేళ్లచెరువు వీరబాబు, సింగారపు సత్యనారాయణ, పిట్టల రాంబాబు, అయోధ్య, గోగుల ఆది తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద తిరుగుబాటు విప్లవ స్వప్నం చేగువేరా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సామ్రాజ్యవాద తిరుగుబాటు విప్లవ స్వప్నం చేగువేరా అని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో చేగువేరా 98వ జయంతి సందర్భంగా చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఆయా దేశాల్లో అణిచివేతపై గెరిల్లా పోరాటాలు నడిపి స్వాతంత్ర ఫలాలు అందించిన ప్రపంచ విప్లవ వీరుడు చేగువేరా అన్నారు. చేగువేరా ఆశయం, పోరాటం నేటికి సజీవమైందని ఆయన త్యాగం అజరామరమైందని ఎక్కడ అసమానత, అణిచివేత మొదలైన అక్కడ చేగువేరా రగిలించిన విప్లవ చైతన్యం ఎత్తిన ప్రతి పిడికిలిలో రగులుతూ జ్వలిస్తూనే ఉంటుందన్నారు. అర్జెంటీనాలో జన్మించి క్యూబా విప్లవ సాధనలో నిలిచి బొలివియా విప్లవ సాధనలో 39 ఏళ్ల వయస్సులో అమరుడైన చేగువేరా చిరస్మరణీయుడు యువతకు స్ఫూర్తి ప్రధాత అన్నారు. క్యూబాలో చేగువేరా పరిశ్రమల మంత్రిగా, జాతీయ బ్యాంక్ అధ్యక్షునిగా, ప్రణాళిక సంఘం అధ్యక్షునిగా, రక్షణ కేంద్రాల అధిపతిగా, ఆర్థిక మైత్రి బృందాల సభ్యులుగా ఎన్నో బాధ్యతలను 39 ఏళ్ల ప్రాయంలోనే నిర్వహించారన్నారు. ప్రపంచ మంతా విప్లవోద్యమాన్ని నిర్మించాలన్న చేగువేరా ఆలోచనను తట్టుకోలేక అమెరికా సామ్రాజ్యవాదులు కుట్ర పన్ని చేగువేరాను అంతమొందించారన్నారు. చేగువేరా స్ఫూర్తితో యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్, గోపి, వెంకట్, రాంబాబు, రాము, లింగరాజు, నాగరాజు, నరేంద్ర, సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఫ్రీ ప్రైమరీ పాఠశాల ఎంపికలో పెద్దకోరుకొండికి అన్యాయం

**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ, ప్రీ ప్రైమరీ విద్య వింటూ ఉంటాం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఎల్కేజీ యూకేజీ విద్యను ప్రీ ప్రైమరీగా ఈ సంవత్సరం కల్లూరు మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల కల్లూరు, కొత్త బోడిమెల్ల, యుపిఎస్ అంబేద్కర్ నగర్, మర్లపాడు, నారాయణపురం, చిన్న కోరుకొండి గ్రామాలలో ప్రీ ప్రైమరీ విద్యా బోధనకు ప్రభుత్వం ఎంపిక చేశారు. ఈ పాఠశాలలలో కార్పొరేట్ విద్యా వలె బోధించేందుకు నూతనముగా బోధకులు ఆయాలను ఎంపిక చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు. మండలంలో 58 పాఠశాలలు ఉండగా వాటిలో అధికంగా ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి ఆరు పాఠశాలలను ఎంపిక చేశారు. దానిలో భాగంగా పెద్ద కోరుకొండి గ్రామంలో 90 మంది ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉన్నారు. అర్హత ఉన్న ఈ పాఠశాలను ఎంపిక చేయకుండా తక్కువ ఉన్న విద్యార్థుల సంఖ్య పాఠశాలను ఎంపిక చేశారని ఈ విధంగా చేశారని పెద్ద కోరుకొండి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు గాను ఆట పాటలు, చిత్రలేఖనం కథల ద్వారా విద్య బోధనను చిన్నారులకు విద్యా బోధన చేసి విద్యార్థుల సంఖ్యను పెంచి విద్యార్థులలో బోధన ఆసక్తి పెంచేందుకు ఈ పాఠశాలల్లో ప్రభుత్వ లక్ష్యం పిల్లలను ఆకర్షించేందుకు రంగురంగుల బొమ్మలు రంగురంగుల పుస్తకాలు సిద్ధం చేశారు. ప్రత్యేక ప్రణాళికలు తో సిద్ధం చేశారు. చిన్నపిల్లలలోని శారీరక మానసికంగా పరిపక్వత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మొత్తం కేటాయించిన నిధులతో చిన్నారులకు ఆట వస్తువులు పెయింటింగ్స్ తదితర సౌకర్యాలు కల్పించునున్నారు.

### త్వరలో ఇన్‌స్టక్టర్ల నియామకం...

ప్రైవేటు పాఠశాలల్లో ఎల్కేజీ యూకేజీ తరగతులకు ఫీజులు కట్టలేక ఫ్రీ ప్రైమరీ స్థాపించడంతో తల్లిదండ్రుల్లో ఊరట కల్పించనుంది. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు మంచి అవకాశం లభించింది. ప్రభుత్వ బడుల్లో కూడా ప్రీ ప్రైమరీ విద్యా ప్రారంభించడంతో విద్యార్థుల సంఖ్య అధికంగా పెరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో కల్లూరు మండలం పెద్ద కోరుకొండి కి పెద్ద అన్యాయం జరిగిందని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సబ్ కలెక్టర్, కలెక్టర్, విద్యాశాఖ అధికారి నీ కలిసి పెద్ద కోరుకొండికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని గ్రామస్తులు తెలుపుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. పెద్ద కోరుకొండి పాఠశాలలో 90 మంది ఉన్న కూడా ఫ్రీ ప్రైమరీ పాఠశాల మంజూరులో అన్యాయం జరిగిందంటూ నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఉద్యమాన్ని చేపట్టనున్నారు. ఈ విషయమై ఎంఈఓ మరియు ప్రధానోపాధ్యాయులు పెద్ద కోరుకొండిని వివరణ కోరగా విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళామని ఉన్నతాధికారుల నుంచి మంజూరు ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు.



# కొలిక్కొచ్చిన మత్స్యకారుల పంచాయితీ

## -నేటి నుంచి చెరువు మాధారం చెరువులో చేపల వేట

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గత కొంత కాలంగా మత్స్యకారుల మధ్య నెలకొన్న పంచాయితీ ఎట్టకేలకు ముగిసింది. ఆదివారం నిర్వహించిన చెరువు మాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో సభ్యుల మధ్య బేధాభిప్రాయాలతో ఏర్పడ్డ వివాదం కొలిక్కి వచ్చాయి. ఈ మేరకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఖాసిం, ధీరావత్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం నుంచి చేపలవేట సాగించాలని, రెండో రోజు సభ్యులకు ఇంటికే చేపల వాటాను పంపాలని, మూడో రోజు గ్రామ ప్రజలకు రూ.100లు చొప్పున విక్రయించాలని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెన్నబోయిన పృధ్వి, డైరెక్టర్లు బలరాం, శేషయ్య, ఎడవల్లి వెంకమ్మ, సభ్యులు మస్తాన్, ధీరావత్ బాలాజి, ఎడవల్లి సైదులు, వెన్నెబోయిన శ్రీనివాసరావు, తేజావత్ లాలు పాల్గొన్నారు.



# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాపక్షం / ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. ఆదివారం ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో డిఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ ప్రత్యేక క్రికెట్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా అండర్ 8 నుంచి 14 వరకు బాల బాలికలు శిక్షణ పొందినట్లు తెలిపారు. క్రీడలతో పాటు చదువులో కూడా రాణిస్తూ పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తీసుకు రావాలన్నారు. సమ్మర్ క్యాంపు నిర్వహించిన నిర్వాహకులు మహ్మద్ మథీన్, కోచ్ శ్రీనివాస్ చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణకు సంబంధించిన ధృవ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు హరికిరణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా, నాయకులు ఆసీఫ్, బానాల లక్ష్మణ్, బెల్లంకొండ వాసు, తుపాకుల శ్రీను, ఎర్రబెల్లి నాగేశ్వరరావు, షేక్ లతీఫ్, గుడిపూడి జగదీష్, ఫరీద్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.




# 14 గంటలు హనుమాన్ చాలీసా పారాయణం


**ప్రజాపక్షం / ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా బాణాపురంకు చెందిన రాయల నాగసాయి 14 గంటల పాటు సుదీర్ఘంగా హనుమాన్ చాలీసా పారాయణం చేసి అంతర్జాతీయ రికార్డు సాధించినట్లు ఎన్ఎస్‌పి రామగిరి రామాలయం ప్రధాన అర్చకులు సముద్రాల వెంకట నర్సింహాచార్యులు తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎన్ఎస్‌పి రామగిరి రామాలయం వేదికగా రాయల నాగసాయి 14 గంటల పాటు సుదీర్ఘంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఇందుకు గాను రెండు అంతర్జాతీయ రికార్డ్స్ (విశ్వ వరల్డ్ రికార్డ్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్), జాతీయ స్థాయి రికార్డ్ (ఆక్సిజన్ బుక్ ఆఫ్ నేషనల్) సాధించినట్లు కార్యక్రమ పర్యవేక్షకులు సముద్రాల వెంకట నర్సింహాచార్యులు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ నరేంద్ర గౌడ్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ తెలంగాణ చీఫ్ కో ఆర్డినేటర్ వంజా మాలతీనాయుడు, ప్రముఖులు చేతుల మీదుగా సర్టిఫికెట్లను నాగసాయికి అందజేశారు. ఈసందర్భంగా నాగసాయి మాట్లాడుతూ గతంలో రెండు అంతర్జాతీయ రికార్డ్స్, ఇప్పుడు రెండు అంతర్జాతీయ, ఒక జాతీయ స్థాయి రికార్డు సాధించడం ఆనందంగా ఉందన్నారు. లోక కళ్యాణం కోసం, విశ్వక్షేమం కోరుతూ నిర్వహించిన ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చిన్నతనం నుంచి ప్రోత్సహించిన మాతృమూర్తి రాయల పద్మకు పాదాభివందనాలు తెలియజేశారు. పలువురు నాగసాయికి శుభాకాంక్షలు తెలిపారు.





# రేణుకాచౌదరి కృషితోనే ఇల్లూరులో ఎల్ఈడీ వెలుగులు

**ప్రజాపక్షం/మధిరమున్సిపాలిటీ:** కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణక చౌదరి కృషితోనే మండలంలోని ఇల్లూరు ఎస్సీకాలనీలో ఎల్ఈడీ కాంతి వెలుగులు అని ఇల్లూరి సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ప్రారంభించి మాట్లాడుతూ..గత కొన్నేళ్లుగా అంధకారంలో ఉన్న ఇల్లూరు ఎస్సీకాలనీ అంధకారంలో ఉన్న నేపథ్యంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వారి నిధుల నుంచి రూ.8లక్షలుతో గ్రామం మొత్తానికి వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీధిదీపాలు లేక సంవత్సరాల తరబడి అంధకారంలో ఉన్న శాశ్వత పరిష్కారం కోసం ఆమె దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రూ.8లక్షలు మంజూరి చేసి, మొదటి విడతగా రూ.4లక్షలతో ఎస్సీకాలనీలో వెలుగులు నింపనందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కోటా వీరయ్య, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.







## ఎమ్మెల్యే పాయంను కలిసిన సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మైపతి



ప్రజాపక్షం/మణుగూరు: అశ్వాపురం మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన మైపతి రాజేశ్వరరావు ఇటీవల సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్‌గా మణుగూరుకు బదిలీ కావడంతో, మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైపతి రాజేశ్వరరావు తన కొత్త బాధ్యతల గురించి ఎమ్మెల్యేతో చర్చించారు. మణుగూరు ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా కృషి చేయాలని అన్నారు. సివిల్ సప్లై శాఖ ద్వారా అందించే సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## శివలింగాపురంలో తీవ్ర నీటి సమస్య

**-నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా**
**-తాగునీటి కోసం తంటాలు పడుతున్న ప్రజలు**




ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం శివలింగాపురం గ్రామంలోని 9వ వార్డులో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా కొనసాగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ పైపులైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులు, సాంకేతిక సమస్యల కారణంగా నిత్యం ఏదో ఒకచోట పనులు జరుగుతుండటంతో నీటి సరఫరా అంతరాయం కలుగుతోందని వారు తెలిపారు. అంతేకాకుండా, నీరు వచ్చిన సందర్భాల్లో కూడా సరిపడా ఒత్తిడితో సరఫరా కాకపోవడం వల్ల చాలా కుటుంబాలకు తాగునీరు అందడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత కొనసాగుతుండటంతో నీటి అవసరం పెరిగినా, అందుబాటులో నీరు లేక మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి పనిచేయని పంపులను మరమ్మతు చేయడంతో పాటు పైపులైన్ సమస్యలను పరిష్కరించి, ప్రతి ఇంటికి నిరంతరంగా తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన ఉల్లోజు భారతి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహవసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, మాజీ సర్పంచ్ తాటి భిక్షం, కట్టా నరసయ్య, తమ్మిశెట్టి సాంబ, బూర్గుల సైదులు, సత్యనారాయణ, వెంకటేష్, బాబు, నరేష్, గంగయ్య, రాములు, మహేష్, దేగల కృష్ణా రావు, గ్రామ ప్రజలు, నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కౌలురైతు పొట్టకొడుతున్న ప్రభుత్వాలు..!

**- పట్టాదారులకే పీఎం కిసాన్, రైతుభరోసా.. సాగు చేసేవానికి గుండు సున్నా**
**- బ్యాంకుల దగా..ప్రైవేట్ వడ్డీల దందా.. అప్పుల ఊబిలో కష్టజీవి**
**- రెండు ప్రభుత్వాల మొండి వైఖరిపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం**
**- అగమ్యగోచరంగా సాగుదారుల బతుకులు**



ప్రజాపక్షం/నేలకొండపల్లి: దేశ ప్రజల అన్నం గిన్నెను నింపేందుకు పగలు, రాత్రి చెమటోడ్చే కౌలురైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న దగా కోరు విధానాలపై గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. రైతు రాజ్యం, రైతు సంక్షేమం అంటూ ఢిల్లీ, హైదరాబాద్ పీఠాలపై కూర్చొని పెద్ద పెద్ద ఉపన్యాసాలు దంచే పాలకులు..క్షేత్రస్థాయిలో భూమిని నమ్ముకుని బతుకుతున్న కౌలురైతులను అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నా యి. రెండు ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక, భూస్వామ్య అనుకూల విధానాల వల్ల నేలకొండపల్లి మండలంలో వేలాది మంది కౌలు రైతుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది.

**- డబుల్ ఇంజన్ దగా..కౌలురైతుకు మొండిచేయి**

రూ.కోట్లల్లో కార్పోరేట్ రుణాలను మాఫీ చేసే కేంద్ర సర్కార్‌కు, ఓట్ల కోసం పథకాలు ప్రకటించే రాష్ట్ర సర్కార్‌కు కౌలురైతు కష్టాలు మాత్రం కనబడట్లేదు. కేంద్రప్రభుత్వం ఇచ్చే 'పీఎం కిసాన్' రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతుభరోసా' పెట్టుబడి సాయం కేవలం భూరికార్డులను ఆధారం చేసుకుని పట్టాదారులకే ఇస్తున్నారు తప్ప అసలు సిసలైన సాగుదారుడైన కౌలురైతును దానికి దూరం పెట్టారు. సాగు చేయకుండా నగరాల్లో, విదేశాల్లో ఉండే భూస్వాములకు రెండు ప్రభుత్వల సాయం అందుతుంటే..ఎండనక, వాననక కష్టపడే కౌలురైతులకు మాత్రం పైసా సాయం అందడం లేదు. ఇదా ప్రభుత్వాలకు నిజమైన రైతులపై ఉన్న ప్రేమా? అని సాగుదారులు ప్రశ్నిస్తున్నారు.

**- బ్యాంకుల దగా..ప్రైవేట్ వడ్డీల దందా!**

ప్రభుత్వ పరిధిలోని బ్యాంకులు కౌలురైతులకు రుణాలు ఇచ్చేందుకు సవాలక్ష నిబంధనలు పెడుతూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి. కౌలురైతులకు కనీసం రుణ అర్హతకార్డులు(సీసీఆర్సీ)కూడా ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తుండటంతో, బ్యాంకులు గేట్లు మూసేస్తున్నాయి. ఫలితంగా రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతిలో చిక్కి తీవ్ర దోపిడీకి గురవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంటలు సర్వ నాశనమైతే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పంట నష్ట పరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) కూడా భూయజమానుల ఖాతాల్లోనే జమ అవుతోంది. ఎరువులు, విత్తనాల సబ్సిడీలు కూడా పట్టాదారుల పేర్ల మీదే ఉండటంతో కౌలురైతులు బహిరంగ మార్కెట్‌లలో నల్లబజారు ధరలకు కొనుగోలు చేసి నిలువునా మునుగుతున్నారు. రెండు ప్రభుత్వాల మొండివైఖరి వల్లే మండలంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేధన వ్యక్తమవుతోంది.

**- ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలి: మారిశెట్టి వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి**



కౌలురైతులను యాచకులుగా మార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఉద్ధృత పోరాటాలకు సిద్ధం కావాలి. కౌలురైతులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. భూయజమానులపై ఆధారపడే అవసరం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలన్నీ నేరుగా కౌలు రైతులకే అందేలా చట్టబద్ధమైన హక్కు కల్పించాలి.

**- కౌలురైతు చట్టం-2011ని పటిష్టంగా అమలు చేయాలి: పాల్తియ శ్రీనివాసరావు, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి**



భూమిని సాగు చేసేది కౌలురైతే అయినప్పటికీ రైతుభీమా, పంట భీమా, బ్యాంకు రుణాలు వంటి ప్రయోజనాలు అందకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఘోర వైఫల్యమే..కౌలురైతు చట్టం2011ను పటిష్టంగా అమలు చేసి ఏటా సాగు ప్రారంభంలోనే గుర్తింపుకార్డులు జారీ చేయాలి. కౌలురైతుల హక్కుల సాధనకై రైతాంగం అంతా ఏకతాటిపైకి రావాలి.

# మన ఊరి బడి..అమ్మ ఒడి

**-అత్యధిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**
**-మీ పిల్ల వాడి భవిష్యత్తు మా భరోసా**










ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన ఊరి బడి అమ్మ ఒడి అంటూ ఎన్నో అత్యాధుని మౌలిక సౌకర్యాలతో విద్యార్థులకు చక్కని వాతావరణంలో చదువును అందించే దిశగా నాణ్యమైన విద్యను నేర్పుతూ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆట పాటలతో మోటివేషన్ కరాటే శిక్షణ సైన్స్ విజ్ఞానక ప్రదర్శనలతో విద్యార్థుల మెదడులకు పదును పెడుతూ నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుపరుస్తూ అన్ని రంగాలలో ముందుకు తీసుకుపోయే దిశగా అన్నపురెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతాన్ని కనపరుస్తూ మెరిట్ మార్కులను సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ విశాలమైన తరగతి గదులు, క్రీడా ప్రాంగణం, పచ్చని హరితహారం రక్షణ గోడను కలిగి ఉన్నటువంటి బన ఊరి మన బడి అమ్మ ఒడి లాటిందని అంటూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ద దిశగా 2026, 27 విద్యాసంస్థలకు గాను తిరిగి ప్రారంభవించుకొనుటకు సిద్ధమైంది. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆంగోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీ పిల్లల భవిష్యత్తు మా భరోసా అంటూ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా తన వంతు కృషి చేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను చైతన్య పరుస్తూ మన ఊరి బడి అమ్మవాడి లాంటిది మన పాఠశాలలో ఉన్నతమైన విద్య, మధ్యాహ్న భోజన కార్యక్రమం, 10వ తరగతులు నిర్వహించి వారిని ఉన్నత దిశగా తీర్చిదిద్దేలా మా వంతు ప్రయత్నం మేము చేస్తాం మీ వంతుగా మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మీ బాధ్యతను నిర్వహించుకోవాల్సిందిగా మీ పిల్లల భవిష్యత్తుకు చక్కటి బాటని వేసే దిశగా మీరు సహకరించాలని తెలియజేశారు.

# జాతీయ జెండాకు అవమానం..!

**-సింగరేణిలో నిర్లక్ష్యానికి నిదర్శనమా..?**
**-అలంకరణ కోసం వినియోగించి గాలికి వదిలేస్తున్న జెండాలు**
**-చినిగిపోతున్నా పట్టించుకోని అధికారులు**
**-జాతీయ పతాక గౌరవాన్ని కాపాడాలని ప్రజల డిమాండ్**






ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని సింగరేణి ఆసుపత్రి ప్రాంగణంలో జాతీయ జెండా పట్ల నిర్లక్ష్య వైఖరి ఆందోళన కలిగిస్తోంది. దేశ గౌరవానికి ప్రతీకగా భావించే త్రివర్ణ పతాకాన్ని కొందరు అధికారులు కేవలం అలంకరణ వస్తువుగా ఉపయోగించి, అనంతరం దాని సంరక్షణను విస్మరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల సందర్భంగా ఆసుపత్రి పరిసరాల్లో చిన్న చిన్న జాతీయ జెండాలతో దండలు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమాలు ముగిసిన వెంటనే వాటిని తొలగించి, గౌరవప్రదంగా భద్రపరచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆ జెండాలు ఎండ, వాన, గాలులకు గురై చినిగిపోతూ కనిపిస్తున్నాయి. దేశ గౌరవానికి ప్రతీక అయిన జాతీయ పతాకం పట్ల ఇలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించడం సమంజసం కాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు లక్షల్లో వేతనాలు పొందుతున్న అధికారులు జాతీయ చిహ్నాల పరిరక్షణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. భారత రాజ్యాంగం, జాతీయ పతాక నియమావళి ప్రకారం జాతీయ జెండాను గౌరవప్రదంగా వినియోగించడం ప్రతి భారతీయుడి బాధ్యత, అలంకరణ కోసం ఉపయోగించిన జెండాలను కార్యక్రమాల అనంతరం సక్రమంగా తొలగించి, నిర్దేశిత విధానంలో భద్రపరచడం లేదా గౌరవప్రదంగా నిర్వహించడం తప్పనిసరి. సింగరేణి ఆసుపత్రి వద్ద చినిగిపోయిన జాతీయ జెండాలు కనిపించడం కేవలం నిర్లక్ష్యమే కాకుండా, జాతీయ భావోద్వేగాలను దెబ్బతీసే అంశంగా మారిందని దేశభక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని,అది దేశ ఆత్మగౌరవానికి ప్రతీకని, దాని గౌరవాన్ని కాపాడటం ప్రతి పౌరుడి, ప్రతి సంస్థ యొక్క బాధ్యతని నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ఆసుపత్రి డాక్టర్ ను ఫోన్ లో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదు. వెల్ఫేర్ ఆఫీసర్ కు విషయం తెలపగా జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఏర్పాటు చేశామన్నారు.గాలికి చినిగి ఉండవచ్చని, జెండా దండలను తొలగిస్తామన్నారు.

# తెలగవరంలో కుంటుపడిన అభివృద్ధి..!

**-ఇబ్బందులు పడుతున్న ప్రజలు**
**-పాలకవర్గంలో సమన్వయ లోపమే కారణమంటున్న గ్రామస్తులు**






ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం తెలగవరం గ్రామంలో పాలకవర్గం సమన్వయ లోపంతో అభివృద్ధి కుంటుపడింది. దీంతో గత ఆరు నెలల నుంచి గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు దొబ్బల రాంబాబు, ఎల్లమందల సాయిరాం, పాటి చిరంజీవి, పదిలం వెంకటేశ్వర్లు తెలుపుతున్నారు. గ్రామంలో పాలకవర్గం లో నలుగురు తోపాటు ఉప సర్పంచ్ , ముగ్గురు తో పాటు సర్పంచ్ ఒకవైపు ఉండటంతో తీర్మానాలు అమలు కాకపోవటం వలన నిధులు ఖర్చుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతూ ఉండటంతో గ్రామంలో అప్పో సప్పో తెచ్చి గ్రామంలో అవసరాలను తీర్చాల్సి వస్తుందని సర్పంచ్ విజయలక్ష్మి పేర్కొంటున్నారు. గ్రామంలో జంగిల్ క్లీనింగ్, దోమల మందు , బ్లీచింగ్, కార్యాలయం కు రంగులు, కార్యాలయం నిర్వహణకు ఫర్నిచర్, ట్యాంక్ కు మెట్లు రంగు, తోపాటు పైప్లైన్ మరమ్మతులు, వీధి లైట్లు నిర్వహణ, గ్రామంలో గ్రామ పంచాయతీ బోర్ మరమ్మత్తులు కు సొంత నిధులతో ఖర్చు చేయాల్సి వస్తుందని అప్పులతో గ్రామ అవసరాలను తీరుస్తున్నామని సర్పంచ్ పేర్కొంటున్నారు. నిధులు డ్రాకు సర్పంచ్ ఉప సర్పంచ్ సంతకాలు పెడితేనే నిధులు తీయాల్సి ఉంటుందని కార్యదర్శి పేర్కొంటున్నారు. పాలకవర్గం సమన్వయ లోపంతో నిధులు ఉండి కూడా తీయలేని పరిస్థితిలో ఉందని కార్యదర్శి పేర్కొంటున్నారు. వారు సమన్వయ లోపంతో గ్రామంలో సేవలు అందించలేకపోతున్నామని కార్యదర్శి మరియు సర్పంచ్ పేర్కొంటున్నారు. మండలంలో అతి తక్కువ జనాభా ఉన్న గ్రామం ఇది ఈ గ్రామంలో పాలకవర్గం మధ్య చిన్నపాటి సమన్వయం లోపం వలన అభివృద్ధి కుంటుపడింది. దీంతో ప్రజానీకం కష్టాలు పడాల్సి వస్తుంది. ప్రజల మౌలిక వసతులు తీర్చలేకపోతున్నట్లు వారు తెలుపుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కానిచో కొద్ది రోజుల్లో సబ్ కలెక్టర్ మరియు కలెక్టర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై స్థానిక ఎంపీ ఓను వివరణ కోరగా సమన్వయ లోపం వాస్తవమేనని రెండు రోజుల్లో ఇరు వర్గీయులను పిలిచి సమావేశం ఏర్పాటు చేసి సమన్వయ పరుస్తానని ఎంపీ ఓ ఏనుగు సురేష్ బాబు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : అభివృద్ధితో పాటు ఆరోగ్య పరంగా కూడా ఐదవ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కాంగ్రెస్ కౌన్సిలర్ బానోత్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన దేవిశ్రీ క్లినిక్ సౌజన్యంతో వార్డులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో కౌన్సిలర్ మాట్లాడుతూ...రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు ప్రజలకు వివరించారు. శిబిరాన్ని విజయవంతం చేసిన వార్డు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్ మాట్లాడుతూ..ప్రజా ప్రయోజనానికి దోహదపడే ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 35 బ్లడ్ టెస్టులు, 60జనరల్ చెకప్‌లు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవిశ్రీ, శ్యాంప్రసాద్, కాంగ్రెస్‌వార్డు నాయకులు గోపాల్, శ్రీను, పెద్ద వినయ్, పుల్లయ్య పాల్గొన్నారు.

## ఉజ్వల భవిష్యత్తుకై 'బ్రిలియంట్@21'

**-జూన్ 16 నుంచి 24వరకు చేరే విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు మినహాయింపు**



ప్రజాపక్షం/బూర్గంపాడు: బ్రిలియంట్ విద్యాసంస్థలు విజయవంతంగా 20 సంవత్సరాలు పూర్తి చేసుకుని 21వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక ప్రవేశోత్సవ కార్యక్రమాన్ని ప్రకటించాయి. ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు అడ్మిషన్ పొందే విద్యార్థుల నుంచి ఎలాంటి అడ్మిషన్ ఫీజు వసూలు చేయబోమని బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కంప్యూటర్, వేదిక మ్యాథ్స్, అబాకస్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. అదే విధంగా నవోదయ, సైనిక్ స్కూల్, ఒలింపియాడ్, ఏకలవ్య విద్యాలయాలు వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక లాంగ్‌టర్మ్ కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో అగ్రగామి విద్యాసంస్థగా గుర్తింపు పొందిన బ్రిలియంట్, విద్యార్థులను కేవలం విద్యలోనే కాకుండా వివిధ పోటీ పరీక్షల్లోనూ కనబరిచేలా తీర్చిదిద్దుతోందన్నారు. గతంలో విద్యార్థులు సాధించిన విజయాలకు గుర్తింపుగా దేశ మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకటయ్య నాయకుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు.

## ఈసం లక్ష్మీనర్సుకు ఘన నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: రేగులగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఈసం లక్ష్మీనర్సు దశ దిన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ దేవస్థానం ఛైర్మన్ అడ్డగూడి ఐలయ్య, సర్పంచ్ మూతి వీరస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమలరావు హాజరై పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈసం లక్ష్మీనర్సు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు, ఉప సర్పంచ్ ఆవుల సత్యనారాయణ, కందుల శ్రీనివాసరావు, నాయకులు జక్కుల కుమార్, కృష్ణ, మధ్యబోయిన వెంకట నరసయ్య, చెవుల భద్రయ్య, ఈసం ఐలయ్య, సాంబ, మధ్యబోయిన కోటయ్య, రామకోటి తదితరులు హాజరయ్యారు.

## విద్యార్థినికి సర్పంచ్ సాయం

**-సన్మానించిన ఇంపాక్ట్ ఇంటర్నేషన్ ఫౌండేషన్**



ప్రజాపక్షం/కారేపల్లి: పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థిని ఆర్థిక పరిస్థితికి చలించిన సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ)రూ 10వేల ఆర్థిక సాయం అందించారు. ఆది వారం కారేపల్లిలోని మోడల్ స్కూల్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభకు పురస్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కారేపల్లి మండలం గాదెపాడుకు చెందిన మమత కోమట్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తగరతి చదివి 548 మార్కులు సాధించింది. మమతను సన్మానిస్తున్న సందర్భంగా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి, తన తండ్రి శ్రీనివాస్ గురించి వివరిస్తుండగా భావోద్వేగానికి గురైంది. మమత పరిస్థితికి చలించిన సర్పంచ్ వెంటనే రూ 10వేలు ఆర్థిక సాయం చేశారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, లక్ష్యం కోసం కష్టపడి చదవాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈసందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధులు భూక్య కర్ణ, ముత్తబోయిన శ్రీనివాస్, దస్తగిరి, వీరస్వామి, భాస్కర్, పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు కూలీ రూ 500 ఇవ్వాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీసం రూ 500 వేతనం చెల్లించాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లి మండలంలోని పాతూరు, గుర్రాలగుంట గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఆయన మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారికి అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత కారణంగా ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల కోసం పనుల వద్ద మెడికల్ కిట్‌లు, టెంట్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలైందని, ప్రస్తుతం కూలీలకు సరిపడా పని దినాలు, తగిన వేతనాలు అందడం లేదని విమర్శించారు. పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు రోజుకు కనీసం రూ 500 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ భూక్యా ధర్మ, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పెద్దరావు నాగరాజు, తాటి రవి, సోయం చిన్నారి, ఊకే అశోక్, సోడే శ్రీనివాస్, బొర్రా సుధాకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమస్య పరిష్కరించేందుకు వెళ్లి.. ప్రాణాపాయంలో పడ్డ పోలీసులు..!

**-సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద ఉద్రిక్తత పరిస్థితిని అదుపుచేసి వస్తుండగా ఢీ కొట్టిన లారీ**
**-కానిస్టేబుల్, హోంగార్డ్‌కు గాయాలు**
**-ధ్వంసమైన బైక్, అధికారిక ట్యాబ్‌లు**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎంతటి ప్రమాదాలను ఎదుర్కొంటున్నారో బూర్గంపాడు మండలంలో జరిగిన తాజా ఘటన మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఇసుక ర్యాంపు వద్ద ఉద్రిక్త పరిస్థితులను చల్లార్చి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుని తిరిగి వస్తున్న ఇద్దరు పోలీసు సిబ్బంది రోడ్డు ప్రమాదంలో గాయపడడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. బూర్గంపాడు మండలంలోని సోంపల్లి ఇసుక ర్యాంపు వద్ద గ్రామస్తులు లారీలను అడ్డుకుంటున్నారనే సమాచారం అందడంతో బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూకోర్ట్ సిబ్బంది కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డ్ శ్రీనివాసరావులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమర్ధవంతంగా వ్యవహరించారు. సమస్యను పరిష్కరించి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈవిషయం తెలిసిన వెంటనే ఎస్ఐ మేడా ప్రసాద్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు పోలీసు సిబ్బందిని వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**ఉద్రికత్తను నివారించిన వెంటనే ప్రమాదం...**

సమస్యను శాంతియుంతంగా పరిష్కరించి విధి నిర్వహణలో భాగంగా తిరిగి వస్తుండగా ఏపీ16టీజే3569 నంబరు గల లారీ అతివేగంగా వచ్చి ఢీ కొట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఢీ కొన్ని వేగం తీవ్రంగా ఉండటంతో బైక్ కొంత దూరం వరకు ఈడ్చుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో కానిస్టేబుల్ మంగీలాల్, హోంగార్డ్ శ్రీనివాసరావులు గాయపడగా, వారు ప్రయాణిస్తున్న బైక్ పూర్తిగా దెబ్బతింది. విధి నిర్వహణ కోసం ప్రభుత్వం అందించిన రెండు ట్యాబ్‌లు కూడా ధ్వంసమయ్యాయి.



**నిర్లక్ష్య డ్రైవింగ్‌పై కఠిన చర్యలు అవసరం...**

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్న అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా భారీ వాహనాల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా వ్యవహరించడం వల్ల ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరుగుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో పోలీసు సిబ్బందే బాధితులుగా మారడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**విచారణ ప్రారంభం..బాధ్యులపై చర్యలు : ఎస్ఐ మేడా ప్రసాద్**

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఇసుక ర్యాంపుతో ప్రాణాలకు ముప్పు..!

**-ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?**
**-స్పందించని అధికారులు.. పెరుగుతున్న ప్రజల ఆందోళన**
**ప్రాణనష్టం జరగకముందే చర్యలు తీసుకోవాలని వేడుకోలు**

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలోని విజయనగరం ఇసుక రీచ్ నుండి ప్రధాన రహదారిపైకి వచ్చే లారీల కారణంగా ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రవాణా వాహనాలు వెళ్లే మార్గంలో తరచుగా వాటర్ స్ప్రే చేయడం వల్ల రోడ్డు మొత్తం జారుడుగా మారి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తాజాగా ఒక కుటుంబం ఈ జారుడు రహదారిపై ప్రమాదానికి గురికావడం స్థానికులను కలవరపాటుకు గురిచేసింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోయినా, భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇసుక రీచ్ వల్ల ఏర్పడుతున్న ప్రమాదాల గురించి పలుమార్లు స్థానిక పత్రికల్లో వార్తలు ప్రచురిత మైనప్పటికీ, సంబంధిత అధికారులు మరియు ర్యాంప్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారిపై నీరు చల్లడం వల్ల ప్రమాదం జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే ఇసుక రవాణానే ముఖ్యమా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి, రహదారిపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించేలా ర్యాంప్ నిర్వాహకులను ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పిఆర్సీని ప్రకటించాలి




**ప్రజాపక్షం/చుంచుపల్లి:** పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ హెచ్చరించారు. కొత్తగూడెంలోని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యాలయం టీచర్స్ భవన్ నందు ఆదివారం జరిగిన జిల్లా విస్తృత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల కుదింపు ఆలోచనను విరమించుకుని, వాటిని బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామపంచాయతీలో ఆదర్శ పాఠశాల ఏర్పాటు, నర్సరీకేజీ తరగతుల ప్రారంభం, ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు

**-ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ**



**ప్రజాపక్షం/దమ్మపేట:** ములకలపల్లి మండలం సీతాయిగూడెం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కారం సుధీర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర(పీహెచ్‌సీ)లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రక్తదానం మహోన్నతమైన సేవ అని, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని అన్నారు. రక్తదాతలే నిజమైన ప్రాణదాతలని పేర్కొంటూ సమాజ సేవా దృక్పథంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన కారం సుధీర్‌ను అభినందించారు. శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువత, రక్తదాతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కారం సుధీర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్‌ఏ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటూ సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల రవాణా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని టీజీఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఆదేశించారు. ఈ విద్యాసంవత్సరానికి గాను 227పని దినాలున్నాయని, అన్ని రూట్లల్లో బస్సులు గ్రామీణ విద్యార్థులకు సైతం సమయానికి నడపాలని సూచించారు. పాతరూట్లను పునరుద్ధరించాలని, సమయపాలన పాటించాలని, అవసరమైతే అదనపు ట్రిప్పులు నడపాలని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మండల యువ కాంగ్రెస్ నాయకులు కడియాల నరేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతిస్తుందని, కార్పోరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు పంపిణీ చేస్తోందని, ఉచిత మధ్యాహ్న భోజనంతోపాటు అనుభవజ్ఞులైన ఉపాద్యాయుల బోధన అందిస్తారని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/వైరాః** మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. ఆదివారం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ వైరా సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పలువురు వాహనదారులకు జరిమానా విధించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు కారణం కావద్దు, ఎక్కువగా యువత మద్యం మత్తులో వాహనాలు అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు అధికంగా మద్యం మత్తులోనే జరుగుతున్నాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలు పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు.

# ముగిసిన వేసవి షటిల్ క్రీడలు



**ప్రజాపక్షం/వైరాః** వైరా ఇండోర్ స్టేడియం నందు వేసవి క్రీడా శిక్షణ కేంద్రం ముగిసిన సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మన వైరా షటిల్ సీనియర్ క్రీడాకారులు శ్రీరామనేని విజయ్‌భాస్కర్, నున్నా శ్రీనివాసరావు, నంబూరి ప్రసాద్, ప్రసాద్ టీచర్, బాలాజి నాయక్, బద్రి, గుడిపూడి రాము, రెడ్డి బహుమతలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోచ్ అంజాద్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

# ప్రతిష్టకు సిద్ధమైన ధ్వజస్తంభాలు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న నూతన ధ్వజస్తంభాలు ప్రతిష్ట మహా కుంబాభిషేకం కార్యక్రమాలపై గ్రామస్తులతో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహనరావు ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. పద్మావతి, అలివేలుమంగ, శివాలయాలలో నూతనంగా ప్రతిష్టించనున్న ధ్వజస్తంభాలు గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు పెద్దెత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రీవకులా మాత స్టేడియం నిర్మాణదాత ఖమ్మం కే.ఎన్.ఆర్.గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు ఆద్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆలయ అర్చకులు, సిబ్బంది ధ్వజస్తంభములను పరిశీలించారు. గ్రామంలో పెద్ద పండుగలా ఈనెల29 నుంచి జూలై3వరకు జరిగే ఆలయ నూతన ధ్వజస్తంభ, మహాకుంబాభిషేకం తదితర కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల విజయ దేవశర్మ, ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ, ఎల్.వి.నారాయణరెడ్డి, నన్నపనేని రామారావు, సుఖవాసి రమేశ్, అంకశాల శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఘనంగా చేగువేరా జయంతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకులు విఫలమవడంతో యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదెర్ల వినయ్ కుమార్ విమర్శించారు. ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 98వ జయంతిని పురస్కరించుకుని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో కారేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలమయ్యాయని, ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. యువత కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా చేగువేరా స్ఫూర్తితో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గాదె నరేష్, తాళ్లూరి రాజా, కాకాటి పృథ్వీ, తులసిమొగ్గ జీవన్, యర్నాగి సంపత్, ఉపెల్లి అఖిల్, మూడ్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు చేయాలి




**-మొక్కజొన్న డబ్బులు ఖాతాలో జమ చేయాలి**
**-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా**

ప్రజాపక్షం/ చింతకాని : ప్రభుత్వం విత్తనాలు తయారు చేసే కంపెనీలపై ఆంక్షలు విధించాలని, నకిలీ విత్తనాలు అమ్మకం, సరఫరా చేసే కంపెనీలపై పిడి యాక్ట్ నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో రాయల వీరయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం తోటకూరి వెంకటనర్సయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ కంపెనీలు నకిలీ విత్తనాలు తయారు చేసి రైతులను నిలువునా ముంచేస్తున్నాయన్నారు. గతంలో నాసి రకం విత్తనాలు నాటడం వల్ల దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నకిలీ విత్తన కంపెనీలపై దృష్టిసారించాలని కోరారు. మొక్కజొన్నలు కొనుగోలు చేసి రెండు నెలలు పూర్తవుతున్నా రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని తక్షణమే నగదు జమ చేయాలని కోరారు. గత సీజన్‌లో రైతులు యూరియా కొరకు తీవ్ర అవస్థలు పడ్డారని అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం ముందస్తుగా యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గోపాలరావు, వత్సవాయి జానకిరాములు, దేశబోయిన ఉపేందర్, అలస్యం రవి, మడుపల్లి కిరణ్‌బాబు, వీరబాబు, లింగం కోటి, వాకా సీతారామిరెడ్డి, గద్దం రమణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందించాలి

**-ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి**




ప్రజాపక్షం/కూసుమంచి: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించడంతో పాటు వ్యవసాయ ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. పాలేరు గ్రామంలోని చాపల అప్పయ్యనగర్‌లో మాతంగి రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఏఐకేఎంఎస్ కూసుమంచి మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీలు తగ్గించడం, ఎరువుల ధరలు పెరగడం, యూరియా కొరత వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలు పండించిన తర్వాత కూడా మార్కెట్లలో రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంకా రుణమాఫీ పొందని రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్




ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారం పెరిగిందని పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాతంగి రామస్వామి, కార్యదర్శిగా చెరుకుపల్లి వీరయ్య, సహాయ కార్యదర్శిగా చాపల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా నిమ్మల వెంకన్న , సభ్యులు బత్తుల వీరన్న, నోముల రంగారావు, పోటు లక్ష్మయ్య, బుర్ర సైదులు, దాట్ల వీరస్వామి, రెడ్డిబోయిన సంజీవరావులు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎం రాజేంద్రప్రసాద్, కే సురేష్, రాష్ట్ర నాయకుడు ఎం గిరి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, శీలం సుదర్శన్, గోపి రవి, కనకం గోపయ్య, కాంపాటి మధు, లింగ, చాపల రామయ్య, మదికుంట్ల సత్యం, చాపల కృష్ణయ్య, పిఓడబ్ల్యు జిల్లా నాయకురాలు కే కల్పన, మున్నా సుశీల, నాగమణి, హైమా, ఉమా, ఉప్పమ్మ, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మానవ హక్కులపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం

ప్రజాపక్షం/బూర్గంపాడు: ముసలిమడుగు గ్రామ పంచాయితీ ఎస్టీ కాలనీలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఉమెన్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మానవ హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గొగ్గెల నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ వెంకన్న, సంస్థ జాతీయ ఛైర్మన్ అనంతుల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మానవ హక్కులపై అవగాహన ఉండాలని అన్నారు. ప్రపంచంలో శాంతి, సమానత్వం నెలకొల్పాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో మానవ హక్కుల కమిషన్ ఏర్పాటైందని వివరించారు. 1948 డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వెలువడిందని తెలిపారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పొందుపరిచిన ప్రాథమిక హక్కులు ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు అందేలా తమ




సంస్థ పని చేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యపై సారించాలని, ఒక గృహిణి చదువుకుంటే కుటుంబమంతా విద్యావంతంగా మారుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జాతీయ కార్యదర్శి సామంతుల దుబాష్, రాష్ట్ర కార్యదర్శి పాయం జైబాబు, ఉపాధ్యక్షుడు సింగమల్ల అప్పారావు, జిల్లా ఇన్‌చార్జ్ పాసి కిషోర్, పోడియం నరేందర్, శ్యామల, మీనా, జ్యోతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# భారజల ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం






ప్రజాపక్షం/అశ్వాపురం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఏరియా హాస్పిటల్ సహకారంతో గౌతమినగరంలోని హెచ్ డబ్ల్యూపీఎం హాస్పిటల్‌లో ఆదివారం ఘనంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అవసరంలో ఉన్న రోగులకు ప్రాణదానం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈకార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన సుమారు 85 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. ఈసందర్భంగా హెచ్‌డబ్ల్యూపీఎం చీఫ్ జనరల్ మేనేజర్ బి శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం అనేది అత్యంత విలువైన సేవ అని, రక్త కొరతతో బాధపడుతున్న వారికి సహాయపడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ డబ్ల్యూపీఎం డీజీఎంలు జగన్నాథ్ శర్మ, ఓజా, సీఏఓ లక్ష్మీ దేవి, డాక్టర్ మనీష్ శ్రీవాస్తవ, డాక్టర్ జయంతి శ్రీవాస్తవ, జ్యోతిరెడ్డి, రమేష్, కె సోమయ్య, అజయ్ కుమార్, మెర్సీ, శిల్ప, భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సుప్రియ, చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వేపకుంట్ల సర్పంచ్ పోట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. ఆదివారం గ్రామంలో నీటి ఎద్దడిని నివారించేందుకు సర్పంచ్ ఆధ్వర్యంలో బోర్ మోటార్‌ను రిపేర్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నీటి ఎద్దడిని నివారించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నర్సింహారావు, రాంబాబు, రమేష్, వీరబాబు, శ్రీను, సంగయ్య, పంచాయతీ సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రికి ఫ్యానులు, ట్యూబులైట్లు వితరణ




ప్రజాపక్షం/ఖమ్మం: ప్రభుత్వాసుపత్రికి 30 ఫ్యానులు, 130 ట్యూబులైట్లు కొంగర రాధాకృష్ణ వితరణ ఆదివారం వితరణ అందజేశారు. వీటిని కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు అందజేయడం జరిగింది. నిర్వాహకులు దొబ్బల సురేష్, చంద్ర శశికుమార్, కొంగర రాధాకృష్ణలను యుగంధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, రావూరి సైదుబాబు, ఖమ్మం నగర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాంబాబు



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా తోటకూరి రాంబాబు నియమితులైనారు. డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ ప్రతిపాదనలు అనుసరించి టిపిసిసి అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ అనారోగ్య కారణాలు, సామాజిక సమీకణాల మూలంగా విశ్వనాథపల్లికి చెందిన తోటకూరి రాంబాబును మండల కాంగ్రెస్ పదవి వరించింది. తనపై నమ్మకంతో కారేపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, టీపీసీసీ అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా అందరి సహకారంతో మండలంలో పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలను ప్రజల ముందు ఉంచనున్నట్లు రాంబాబు తెలిపారు. నూతన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన రాంబాబును ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

# కూనంనేని నాయకత్వం ఆదర్శనీయం



ప్రజాపక్షం/చుంచుపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ సామాన్య ప్రజల హక్కుల సాధనకు కట్టుబడి పనిచేస్తున్న కూనంనేని సాంబశివరావు నాయకత్వం అందరికీ ఆదర్శప్రాయమని చుంచుపల్లి మండల సిపిఐ కార్యదర్శి వాసిరెడ్డి మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు జన్మదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, కార్మికులు, రైతులు, పేదల సమస్యలపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చూపుతున్న చిత్తశుద్ధి, పోరాట పటిమ సిపిఐ పార్టీకి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కూనంనేని ఎల్లప్పుడూ ముందుటారని కొనియాడారు. ఈ జన్మదినం సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

# వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నియామకం

ప్రజాపక్షం/వైరా: వైరా మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులను ప్రకటించారు. వైరా మండలం నారపనేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి మండల అధ్యక్షుడిగా, వైరా పట్టణ అధ్యక్షుడిగా 1వ వార్డుకి చెందిన వీరంశెట్టి సీతారాములను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



